Title : **THE RESURRECTION**

Preached by **Dr. W euGENE SCOTT**, PhD., Stanford University
At the Los Angeles University Cathedral
Copyright : © 2007 Pastor Melissa Scott - All Rights Reserved

శీర్షిక : **పునరుద్ధానము**

ప్రసంగీకులు : డా. డబ్ల్యూ యు జేన్ స్కాట్ పి.హెచ్ డి., స్టాన్‌ఫోర్డు యూనివర్శిటి
స్థలం : లాస్ ఏంజల్స్ యూనివర్శిటి కెథిడ్రిల్
కాపిరైట్ © 2007, పాస్టరు మెలిస్సా స్కాట్ – సర్వహక్కులు మావి.

# THE RESURRECTION

# పునరుద్ధానము

కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాకు కలిగిన మానసిక వత్తిడి కారణంగా నేను నా క్రైస్తవ విశ్వాసం కోల్పోయాను. యేసుక్రీస్తుని ఒక "మంచి జ్ఞానవంతుడైన బోధకుని"గా నమ్మితే చాలని అనుకొనేవాడిని. ఆయనను ఇస్లాం మత స్థాపకుడైన మహ్మద్ ప్రవక్తతో గాని, బౌద్ధమత స్థాపకుడైన గౌతమబుద్ధునితో గాని, లేక చైనా దేశంలోని ప్రముఖ రాజకీయవేత్త కన్‌ఫ్యూష్యస్‌తో పోల్చవచ్చని అనుకొన్నాను. యేసుని వారితో సమంగా, ఒక మత స్థాపకునిగా పరిగణించాను., యేసుని దేవుని కుమారునిగాను మానవతాతీతమైన వానిగా అంగీకరించలేకపోయాను. అన్ని మతాలు ఒకే మూలం నుండి వచ్చినవని కొందరు అంటారు. నా మీద కూడా అటువంటి భావాల ప్రభావం వుండేది. అందువలన మొదట నుండి కొందరు నమ్ముతున్నట్లు యేసుక్రీస్తు దేవుని కుమారుడని, మానవతాతీతుడని నమ్మడం అంత తెలివైనది కాదని అనుకునేవాడిని. కాకపోతే అందరిలాగ క్రొత్త మతాలు స్థాపించిన వారిలో ఈయన కూడా ఒకడని ఒప్పుకోవాలి అని అనుకొన్నాను. ఆ విధంగా క్రీస్తు ఒక మంచి జ్ఞానవంతుడైన బోధకునిగా మిగిలిపోయాడు. క్రీస్తు ఒక మానవాతీతునిగా, దేవుని కుమారుడు కాకుంటే దానికి ప్రత్యామ్నాయంగ ఒక మంచి బోధకుడు. కాని ఇక్కడ వున్న సమస్య – ఆయనను ఒక మంచి బోధకుడు మాత్రంగా గాని, లేకుంటే ఒక జ్ఞానిగా గాని వేరు వేరుగా చూడలేము. ఆయనలో ఆ రెండు లక్షణాలు కలసి వుంటవి.

మంచివాడు అని అనిపించుకోవాలంటే నీవు ఏది సత్యమో దాన్నే తెలియజేయాలి. నీవు అవివేకివి అయి వుండవచ్చు, లేకుంటే నీ మానసిక స్థితి సరిగ్గా లేకపోయి వుండవచ్చు. అయినా, ఒక విషయం సరి అయినది కాకపోయినా దానిని నమ్మినా మంచివాడిగా పిలువబడవచ్చు. కాని, నిన్ను జ్ఞానవంతుడవని అనలేము. నీవు జ్ఞానవంతుడవు అని అనిపించుకోవాలంటే సరి అయిన మార్గంలో, క్రమపద్ధతిలో ఉండాలి. మంచిగా వుండాలంటే నిజాయితీపరుడుగ వుండాలి.

క్రీస్తు జ్ఞానవంతుడు, మంచి బోధకుడు అని తెలుసుకోవాలంటే చరిత్రలో ఆయన బోధించిన బోధల గురించి, ఆయన క్రియలను గమనించాలి. కొందరు క్రీస్తు మానవాతీతుడు కాదని చెప్పడానికి సువార్తలలో కొన్ని వచనాలు, వాక్యాలు, ఆయన బోధన గురించి, జీవన శైలి గురించి వెదకి తీశారు. వాటిని టి.వి.లలో కూడ ఎత్తు అక్షరాలలో వ్రాసి ప్రచారం చేశారు.

నేను క్రీస్తు గురించి చెప్పే విషయాలు సువార్తలకే పరిమితం చేయను. వేరే మూలాలు కూడ చూద్దాము. "క్యూ" డాక్యుమెంటు నిర్వివాదమైన ప్రమాణరచన : క్రీస్తు శిష్యులలో ఒకడైన మత్తయి, ఆయనతో ప్రయాణాలు చేసినప్పుడు, ఆయన చెప్పిన మాటలను తన స్వంత భాష అయిన ఆరామిక్‌లో వ్రాశాడని, ఒక ఆది సంఘ గురువు అన్నారు. మత్తయి సువార్త అంతియొకయ పట్టణంలో గ్రీకు భాషలో వ్రాయబడినదని మనకి తెలుసు. కాని ఆరామిక్‌లో వ్రాసిన క్రీస్తు మాటలు" అన్ని సువార్తలకు మూలమై ఉండవచ్చు. గ్రీకు భాషలో చదవగలిగిన వారు కొన్ని భాగాలలో శైలి వేరుగా వుందని గమనించారు. మత్తయి, మార్కు, లూకా సువార్తలకు ముఖ్యంగా మత్తయి, లూకా సువార్తలకు మూలం ఒకటే అని తెలుసుకున్నారు.

ఆధునిక స్కాలర్స్ మార్కు సువార్త అన్ని సువార్తలకంటే ముందుగా వ్రాయబడినది అని అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే మత్తయి, లూకా సువార్తల శైలి మార్కు సువార్త చూసి వ్రాసినట్లుగా వున్నది. ఈ మూడు సువార్తలకు మూలం 'క్యూ' డాక్యుమెంట్లని ఖచ్చితంగా ఒప్పుకొనవలెను. పూర్వం ఉన్న పాటలు చిన్న రచనలలో భాగాలను కూడ మనం గమనించవచ్చు. అయినా కొన్ని రికార్డులలో క్రీస్తు చెప్పిన మాటలు, క్రియలు ఆయన తాను "జ్ఞానవంతుడను మంచివాడిని" అన్నట్లు లేదు.

**1. ఏ లోపం లేని వానిగా తలచాడు :** మానవుడు ఏ తప్పు లేకుండా వుండలేడు. స్వనీతితో నేను తప్పు చేయలేదు. పరిపూర్ణుడనని ఎవరైనా అంటే మనం ఒప్పుకోలేము. యేసు పరిపూర్ణుడా కాదా అనే విషయం గురించి మాట్లాడుకోవడం లేదు. వారు చాలా పవిత్రులు, పరిపూర్ణులు అనుకునేవారిని ప్రవక్తలుగా చేయవచ్చు, పాత నిబంధన గ్రంథములో దేవుడు ఏర్పరచుకొన్న వారు పరిపూర్ణులు కారు. వారికీ బలహీనతలు వున్నవి.

"ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి తోడుకొని పోవుటకు నేనుంతటి వాడిని" – నేను బాలుడనే మాటలాడుటకు నాకు శక్తి చాలదని………"

దేవుడు ఒక మనిషిని అంగీకరించాలన్న మనం కూడ వారిని అంగీకరించాలన్న వారి బలహీనతలు గుర్తుంచుకొంటాము. పరిశుద్ధులకు వారికి దేవునికి మధ్య గల దూరం తెలుసు. దేవుని చూసిన వాడు ఒక్కడే వున్నాడు ఉజ్జియా చనిపోయిన సంవత్సరం యెషయా ఒక్కడే దేవుడు సింహాసనాసీనుడై పైకి ఎత్తబడటం చూశాడు. అంటే దేవుడు అందరి కంటే అత్యధికుడు అని అర్థం. అప్పుడు యెషయా పలికిన మొదటి మాట" అయ్యో, నేను నశించితిని" అని. తాము పరిపూర్ణులు అనుకున్నంత మాత్రాన మనష్యులెవరినీ మనం పరిశుద్ధులుగా భావించలేము – కాని క్రీస్తు తాను పరిశుద్ధుడనని అన్నాడు. మనం క్రీస్తుని చూసిన ప్రతిసారి మనకు తాను పరిశుద్ధుడు అనే విషయం గుర్తు తెస్తున్నాడు. ఇతరులకు తీర్పు తీరుస్తున్నాడు. "సున్నం కొట్టిన సమాధులు లాటి వారలారా…", "అంధులైన మార్గదర్శకులారా, దోమ లేకుండునట్లు వడియనట్లు వంటెను మ్రింగువారు మీరే". మంచి వారిలాగ కనిపించే వారికి వారి బలహీనతలు తెలియజేశాడు. మనం ఎవరికి తీర్పు తీర్చలేము. తీర్పు తీర్చాలంటే సున్నితమైన మనస్సాక్షి కలిగి వుండాలి. మన తోటి వారికి తీర్పు తీర్చటం చాల కష్టం ఎందుకంటే వారికి వున్న బలహీనతలు మనకు కూడా వున్నవి కాబట్టి. కాని

క్రీస్తుకయితే ఎటువంటి బలహీనతలు లేవు. నేను ధర్మశాస్త్రము త్రోసి వేయటానికి రాలేదు కాని దానిని నెరవేర్చుటకు వచ్చానని చెప్పేడు. కాని ఒకసారి మాత్రం సైనికాధికారి ఆయనను "సద్బోధకుడా" అని పిలిచినప్పుడు, "నీవు నన్ను ఎందుకు సత్పురుషడని యేల చెప్పుచున్నావు?", "దేవుడొక్కడే మరి ఎవడును సత్పురుషుడు కాడు". క్రీస్తు గురించి మాట్లాడేవారు తర్వాత వున్న ముఖ్యమైన విషయం గమనించడం లేదు. "నీవు నన్ను సత్పురుషడని పిలవాలనుకొంటే దేవుడొక్కడే సత్పురుషడని గ్రహించాలి. కాబట్టి నేను కూడా దేవుడనని గ్రహించకుండ సత్పురుషుడా అని విజ్ఞప్తి చేయకూడదు".

ఆయనకు అంత నైతిక పరిపూర్ణత వున్నది. ఆయన అత్యంత నీతిమంతుడని ఆయన ప్రవర్తనలో చూస్తాము.

2. ఆయనలో సమస్త అధికారాలు వున్నవి. ఆకాశం భూమి మీద సర్వాధికారాలు నాకు వున్నవని చెప్పేడు. "మీరు చెప్పినది మీరు వినియున్నారు. నేను మీకు చెప్పునదేమనగ....... అని ఏ మాత్రం సంశయించకుండా తీర్పు చెప్పేడు. మనం అటువంటి పరిశుద్ధులను తయారు చేయలేము. ఈ అధికారం ఈయనకు ఎక్కడ నుండి వచ్చింది అన్నప్పుడు? అధికారం ఆయనదే అని ఆయన చూపిస్తున్నాడు.

3. మత ప్రపంచంలో తనను కేంద్రంగా వుంచుకొన్నాడు. ఆయన తనను గురించి తాను బోధించాడు గాని, వేరే సత్యాల గురించి, ఇతర సిద్ధాంతాల గురించి బోధింపలేదు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు, మీరు నన్ను ఎరిగి వుంటే నా తండ్రిని ఎరిగి వుంటారు?"

"గొఱ్ఱెలు పోవు మార్గము నేనే"

"ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని, తన భార్యను పిల్లలను, అన్నదమ్ములు, అక్కజెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు". ఆయనతో మీకు ఉండవలసిన సంబంధాన్ని చూపిస్తున్నాడు" మతానికి తాను కేంద్రంగా వున్నానని చెబుతున్నాడు

4. మనకి మన ఇంటి గురించి, అందులో వస్తువులు ఏ ప్రదేశంలో వుంటవో తెలుసు. నేను "మా ఇంట్లో సోఫా బ్రౌన్ కలర్‌లో వున్నది" అని నేను చెబితే, "నీకెలా తెలుసు?" అని నీవు అడుగవు కదా. మన ఇంటి గురించి మనకు బాగా తెలుసు కనుక ఆ జ్ఞానంతో మనం ఇంటి గురించి మాట్లాడ కలుగుతాము. దాని విషయంలో వాదన వుండదు. మనం చెప్పిన దానిని ఇతరులు నమ్మేటట్లు వుంటుంది. యేసు ప్రభువు నిత్యత్వం గురించి ఇటువంటి జ్ఞానంతోనే మనకి చెబుతన్నాడు. "నేను తిరిగి వెళ్తున్నాను. మీ కోసం నివాసం సిద్ధపరుస్తాను. నేను మరలా వచ్చి మిమ్మల్ని అక్కడకు" తీసుకొని వెళ్తానని చెప్పాడు. సాధారణ విషయం లాగ "అబ్రహాముకి ముందు నేను వున్నాను" అని చెప్పేడు. "సాతాను మెరుపు వలె ఆకాశము నుండి పడుట చూచితిని" అని, వేరొక సందర్భంలో 'పాపి పశ్చాత్తాప పడినపుడు పరలోకములో దూతలు సంతోషిస్తార'ని చెప్పాడు. ఆయనకు నిత్యజీవం గురించి, భూమి పుట్టక ముందు వున్న సంగతుల గురించి ఎంతో దగ్గరగా తెలుసునన్న విషయం మనకి తెలియజేశాడు.

5. క్రయధనముగా మన కొరకు చనిపోవును. తను క్రయధనముగా చనిపోయి ఈ లోకములోని పాపమును పరిహరిస్తాడని చెప్పాడు. ఆయన, మాటలు వినే వారికి ఆయన ఏ సందర్భంగా క్రయధనం అనే మాటను వాడేడో అర్థం అవుతుంది. క్రయధనం అంటే పోయిన స్వాస్థ్యం తిరిగి పొందుటకు, నీవు చెల్లించవలసిన మూల్యం. వారు చేసిన తప్పులను బట్టి, మరణపాత్రులైన వారిని రక్షించుటకు చెల్లించు మూల్యం. ఆ క్రయధనం చెల్లింపబడినప్పుడే పోయిన నీ స్వాస్థ్యం పొందగలవు. నీవు చేసిన పాపముల నుండి రక్షింపబడగలవు. పాపంతో నిండిన ఈ లోకమును రక్షించుటకు, ఆయన ఈ లోకమునకు వచ్చి మన కోసం క్రయధనంగా చనిపోతానని చెప్పాడు.

6. తిరిగి మరలా లేస్తాడు

నేను చనిపోయి తిరిగి లేస్తానని చెప్పేడు. ఒక వేళ నేను దేవునితో మాట్లాడుతున్నాను "తండ్రీ నేను నీవు చేయమన్న పనులన్నీ చేశాను, నాలో పొరపాట్లు లేవు, ధర్మశాస్త్రం నెరవేర్చాను" అని చెప్పి, మీతో "నన్ను మీరు బోధకునిగా అంగీకరించి మీ జీవితంలో నాకు ముఖ్యస్థానం ఇస్తే మీకు నిత్య జీవం కలుగుతుంది" అని నేను చెబితే ఎలా వుంటుంది? నాకు పిచ్చి పట్టిందని నన్ను జూసి జాలిపడతారు. ఇపుడు నేను మీతో "నేను అబ్రహాామునకు ముందుగా వున్నాను, ఆదాము పుట్టక ముందు సాతాను త్రోసివేయబడటం చూశాను" అని అనగలనా? ఆ విధంగా మాట్లాడితే మీరు పిచ్చి వాడినని అనుకొంటారు. తర్వాత నేను పరలోకం గురించి నా స్వంత ఇంటి గురించి మాట్లాడినట్లు మాట్లాడతాను. నా మనస్థితి సరిగ్గా లేదని గ్రహించి, నేను నా ఇంటి గురించి చెప్పినా నమ్మరు. నేను లోకానికి క్రయాధనంగా వచ్చానని చెబితే నాకు పిచ్చి ముదిరిందని బాధపడతారు.

మనం మూలాల (Sources)లో చూసినట్లయితే ఈ విధంగా చరిత్రలో చెప్పగలిగిన వాడు క్రీస్తు ఒక్కడే. యేసు చెప్పిన ఈ విషయాలు ఏ మతబోధకుడు కూడ చెప్పలేదు, ఆయన చేసిన క్రియలు చేయలేరు, ఆయనను గురించి సూచక క్రియ చెప్పమన్నా వారికి ఆయన ఒక సూచన క్రియ చెబుతానన్నాడు. విశ్వాసాన్ని బలపరచగల, కచ్చితమైన ఒకే ఒక సూచక క్రియ యోనా గురించిన సూచక క్రియ. తన మరణ పునరుద్ధానమును వారికి అర్థము అగునట్లు ప్రవక్త అయిన యోనాను గురించిన  సూచక క్రియ ఆయన వారికి ఇచ్చాడు.  దేవుడు తన కుమారుని పునరుద్ధానము ద్వారా సమర్థించుకొన్నాడు. పౌలు మార్స్ కొండ దగ్గరకు వచ్చినప్పుడు అక్కడ కొందరు జ్ఞానులు కూడి అనేక ప్రతిమలలను చూస్తూ వుంటారు. ఒక చోట ఒక బలిపీఠం మీద తెలియబడని దేవునికి అని వ్రాసి వుండటం చూస్తాడు. ఆ పరిస్థితిని క్రీస్తు గురించి బోధించుటకు అవకాశంగా పౌలు తీసుకుంటాడు. ఆ తెలియని దేవుడెవరో మీకు తెలియజేస్తానని క్రీస్తు గురించి చెబుతాడు. 'దేవుడు ఆయన పునరుద్ధానం అవుటకు నిర్ణయించియున్నాడు. మృతుల పునరుద్ధానం లేని యెడల మన విశ్వాసము వ్యర్థమె. దేవుడు క్రీస్తును లేపెనని మేము సాక్ష్యము చెప్పియున్నాము. లేని ఎడల దేవుని విషయమై అబద్ధపు సాక్షులు'గా అగపడుచున్నాము.

క్రైస్తవ సంఘానికి పేతురు తన మొదటి ప్రసంగాన్ని పెంతికోస్తు దినాన బోధించియున్నాడు. "నేను మీకు ప్రచారం చేయుచున్న యేసే క్రీస్తయి యున్నాడు". వీరు ఆయనను సిలువ వేశారన్న సత్యాన్ని గుర్తు చేశాడు. ఆ

విషయం వారికీ తెలుసు. తరువాత, వారికి తెలియని విషయం గురించి సాక్ష్యమిచ్చాడు. ఈ యేసును దేవుడు లేపెను, దానికి మేమందరం సాక్షులమనే సత్యాన్ని తెలియజేశాడు అని పౌలు తన ప్రసంగాల్లో వివరించాడు.

ఆయన సమాధిలో నుండి వచ్చాడు. ఏ మానవుడు కూడ తాను సమాధిలో నుండి వచ్చానని చెప్పలేదు. యేసుక్రీస్తు పునరుద్ధానం గురించి తెలుసుకొనక ముందు, కొన్ని విషయాలు పరిశోధింపవలసి వున్నది. అవి ఏమిటమటే, ఏసుక్రీస్తు ఈ లోకంలో అసలు జన్మించాడా? ఆయన ఆసలు జీవించలేదనే వారు, ఆయన పునరుద్ధానం గురించి ఎట్లా మాట్లాడతారు? ఆయన ఒకప్పుడు జీవించితేనే కదా మరణించి, సమాధిలో నుండి లేవగలిగేది? ఇది వరకు ఈ విషయంలో ఎన్నో వాదోపవాదాలు జరిగేవి. కాని ఈ రోజుల్లో అర్థవంతంగా చర్చించుకోవాలంటే కొన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి.

**1వ సత్యం :** క్రీస్తు జీవించాడు. ఆయన జీవించాడని మీకు నమ్మకం లేదా? ఆయన ఎప్పుడో, ఎక్కడో జన్మించాడనే విషయం నిరూపించటం కష్టం కాదు. ఆ విషయం నిరూపించిన తర్వాత పునరుద్ధానుడయ్యాడనే విషయానికి వద్దాము.

**2వ సత్యం :** ఆయన కొంతమంది ప్రధాన యాజకుల ప్రోద్బలం వలన సిలువ వేయబడ్డాడు. రోమా అధికారులు ఆయనను సిలువ వేయమని ఆజ్ఞాపించి, ఆ శిక్షను అమలుపరిచారు. కొంతమంది యూదా ప్రధాన యాజకులు ఆయనను సిలువ వేయించారు. మనం యూదులందరిన్న నిందించకూడదు. ఆయన శిష్యులు కూడ యూదులే కదా. క్రీస్తు సిలువ వేయబడ్డాడు అనే విషయాన్ని ఋజువు చేయడం, పునరుద్ధానుడయ్యాడని ఋజువు చేయటం కంటే సులభం.

**3వ సత్యం :** ఆయన చనిపోయాడని తలంచారు. ఆయన చనిపోయాడని అనుకొన్నారని ఎందుకంటున్నానంటే, కొంతమంది 'ఆయన స్పృహలోకి వచ్చి సమాధిలో నుండి వెళ్ళేడు' అని అంటున్నారు. ఆయనను బళ్ళెంతో ప్రక్కలో పొడిచారు.  సిలువ మీద నుండి దించి సమాధిలో పెట్టేరు. కొంతమంది పునరుద్ధానం గురించి ఒప్పుకోకుండ, "ఆయన లాజరుని సమాధిలో నుండి తెచ్చాడు కదా, ఆయన సమాధిలో నుండి బయటకు ఎలా రావాలని ముందే ప్రాక్టీసు చేశాడు" అని వూహాగానాలు చేశారు. లాజరు సమాధిలో నుండి వచ్చినప్పుడు లాజరు శరీరం కుళ్ళిపోయి వున్నది కదా. వారికి ఆయన పునరుద్ధానుడయ్యాడని ఒప్పుకోవటం ఇష్టం లేదు. వారు కనీసం ఆయన చనిపోయాడని ఒప్పుకొన్నారు.

**4వ సత్యం :** ఆయన అందరికి పరిచయస్తుడైన, అందుబాటులో వున్న అరిమత్తయ్య సమాధిలో వుంచబడ్డాడు. ఆ రోజుల్లో ప్రజలకు, ముఖ్యంగా రోమాసైనికులకు ఆ సమాధి ఎక్కడ వున్నదో తెలుసు. ఆ సమాధి వుంచబడిన ప్రదేశం కూడా అందరు వెళ్ళటానికి అనువైన తెలిసిన ప్రదేశంలోనే వున్నది, ఎవరైనా సమాధి వరకు వెళ్ళగలరు. రాతితో మూయబడి వుండుట వలన, రోమా సైనికులు కావలి యుండుట మూలాన వారు సమాధిలోనికి వెళ్ళలేరు గాని, బయట నుండి చూడగలరు.

**5వ సత్యం :** ఆయన చెప్పిన ప్రకారం ఆయన లేచాడు. ఆయన చనిపోయి, లేవబడి పైకి వెళ్తాడు అనే విషయాన్ని ముందే బోధించాడు. ఈ విషయాలన్నీ ఆయన నివసించిన పట్టణంలోనే ఆయన చనిపోక ముందే స్పష్టంగా చెప్పబడినవి. ఆయన లేచాడని నేను ఇప్పుడు చెప్పటం లేదు గాని సమాధి ఖాళీగా వున్నది.

**6వ సత్యం :** ఈ రోజుల్లో మన కంటే, ఆ రోజుల్లో ప్రధాన యాజకులకు ఆయన పునరుద్ధానం అవ్వలేదని నిరూపించటం ముఖ్యం. ఎందుకంటే వారి పరువు ప్రతిష్టలు దాని మీద ఆధరపడి వున్నవి. వారు ఆయన దేవదూషణ చేస్తున్నాడు. వేరే రాజ్యస్థాపన చేస్తానంటున్నాడని, ఆయన మీద అనేక నేరారోపణలు చేసి సిలువ వేయించారు. ఆయన చెప్పినట్లు సమాధిలో నుండి లేపబడి పునరుద్ధానుడు అవలేదని నిరూపించుటకు వారు ఎంతో ప్రయత్నించి వుండవచ్చు.

**7వ సత్యం :** పునరుద్ధానం గురించి బోధించారని శిష్యులు శ్రమలు పెట్టబడ్డారు. మొదట వారిని అబద్ధికులన్నారు. తర్వాత క్రీస్తు శరీరాన్ని మాయం చేశారన్నారు. శిష్యులు పడిన శ్రమలను మనం అపొస్తలలు కార్యములంతటిలో చూస్తున్నాము. శతాబ్దాల తర్వాత కూడా క్రైస్తవులు రోమా సామ్రాజ్యంలో ఎంతో శ్రమలనుభవించారు. క్రీస్తు మరణం తర్వాత జరిగిన పునరుద్ధానం గురించి శిష్యులు బోధించకుండా వుండి వుంటే, బోధించడం వెంటనే ఆపి వుండే వారు ఇన్ని శ్రమలు అనుభవించే వారు కాదు. వారి శ్రమలు అంతటితో ఆగిపోయి వుండేవి.

**8వ సత్యం :** ఖాళీ సమాధి. ఆయనను సిలువ వేయించిన ప్రధాన యాజకులకు బ్రతుకు తెరువు సవాలు. అందుకని వారు సమాధి ఖాళీగా వున్నదో లేదేనని చెక్ చేయటానికి వెళ్ళి వుంటారు. సమాధి ఖాళీగా లేకపోతే వారు వెంటనే చెప్పేవారు. దీనిని బట్టి మనకి సమాధి ఖాళీగా వున్నదని ఋజువు అవుతుంది. ఎన్నో శతాబ్దాలతర్వాత క్రీస్తుని వుంచిన సమాధి చరిత్రలో మరుగు అయినది, ఎందుకంటే ఆ ఖాళీ సమాధిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రొటెస్టెంట్లు గోర్డన్ సమాధిగా గుర్తించారు. అది బస్స్టాండుకి దగ్గరలో గోల్గొతా అనబడే రాతిగుహలో వున్నది. దాని మీద అరబ్బు సమాధులు ఉన్నవి. మనం సాక్షాధారలు చూపినప్పుడే ప్రజలు నమ్ముతారు. క్రీస్తు పునరుద్ధానం గురించిన బోధనలు ఎంత శక్తిమంతంగా వున్నవంటే ఆయన చనిపోయిన తర్వాత శతాబ్దాల తరబడి రకరకాల సిద్ధాంతాలు దాని గురించి చెప్పబడినవి. పునరుద్ధానం నిజం కాకపోతే ఎవరు దాని విషయం శతాబ్దాల తరబడి మాట్లాడరు కదా. శిష్యుల బోధలు ఎంత నిజాయితీగా వున్నవంటే వారు చెప్పిన విషయాలను నిరూపించటానికి రకరకాల థియరీలు, వాటిని నిరూపించేసత్యాలు వచ్చినవి. 1) శిష్యులు క్రీస్తు శరీరమును దొంగిలించారు. 2) యూదా అధికారులు దొంగిలించారు, 3) రోమా అధికారులు దొంగిలించారు, 4) స్త్రీలు తప్పు సమాధి దగ్గరకు వెళ్ళేరు. వారు ఆయన సమాధిలో నుండి లేచాడని నమ్మేరు. వారు ఏడుస్తూ, మేము వెళ్ళేము, ఆయన అక్కడ లేడు" అని అరుస్తూ వెళ్ళేరు. 5) అది అంతా భ్రమ. గొప్ప పగటి కలలు. వారు నిజాయితీ గల మనుష్యులే. కాని వారు ఏదో భ్రమలో ఉండటం వలన ఖాళీసమాధిలాగ కనుపించింది. 6) ఆయన స్పృహలోనికి తేబడ్డాడు. ఆయనను సిలువ వేశారు. చనిపోయాడని తలంచి, సమాధిలో వుంచారు. ఆయన చనిపోలేదు. సమాధి లోపలి చల్లదనానికి స్పృహలోనికి వచ్చాడు; సమాధి గుడ్డలతో, సమాధి మీద పెట్టబడిన పెద్దరాతిని తొలగించి, నిద్రపోతున్న సైనికులకు కనుపించకుండా బయటకు వచ్చాడు.

7. శిష్యులు అబద్ధం చెప్పేరు. శిష్యులు చెప్పినదంతా అభూతకల్పన. వారు చెప్పిన అబద్ధాలను కప్పి పుచ్చుకొనటానికి, ఈ కథను కల్పించారు. వారికి ఈ విషయం చెప్పటానికి ఏడు వారాలు పట్టింది.

8. ఇదంతా సత్యం. వారు చూసింది, అనుభవించినది చెప్పేరు. పైన చెప్పిన సిద్ధాంతాలను విడి విడిగా విన్నప్పుడు వింటానికి బాగానే వుంటవి. పైన చెప్పబడిన ఎనిమిది సిద్ధాంతాలను, పరీక్షించి ఒక నిర్ణయం తీసుకొందాము. శిష్యులు ఆయనను ఎత్తుకొనిపోయారనే అబద్ధం ప్రధాన యాజకులు కల్పించారు.

1. ఒకవేళ శిష్యులు నిజంగా ఆయన శరీరాన్ని తీసుకొని వెళ్తే వారు అబద్ధం ఆడుతున్నట్లు.

2. రోమా అధికారులు క్రీస్తు శరీరాన్ని మాయం చేశారు. ప్రధాన యాజకులు క్రీస్తుని సిలువ వేయించగలిగేంత అధికారం వున్నది, పలుకుబడి వున్నది. ఒకవేళ రోమా అధికారులు శరీరాన్ని మాయం చేస్తే వారు ఊరుకుంటారా ? అందరికీ తెలియపరుస్తారు కదా.

3. స్త్రీలు పొరపాటున వేరే సమాధి దగ్గరకు వెళ్ళేరనుకోవటానికి, అది అందరికీ తెలిసిన, అందుబాటులో వున్న సమాధి ప్రదేశం. ప్రధాన యాజకులకు క్రీస్తును ఏ సమాధిలో పెట్టేరో తెలుసు, తప్పు సమాధికి స్త్రీలు వెళ్ళేరని అనుకొన్నప్పుడు, వారు క్రీస్తుని వుంచిన సమాధి దగ్గరకు వెళ్లి చెక్ చేసి వుంటారు.

5. భ్రమలు. ఒకవేళ వారు భ్రమ పడ్డారని భావించితే మిగతా వారికి ఆయన శరీరం సమాధిలో కనిపించాలి కదా?

6. స్పృహలోనికి వచ్చాడు. ఆయన స్పృహ లోనికి వచ్చి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. క్రీస్తు వంటి మంచి బోధకునిది ఆ విధంగా వెళ్ళిపోయే స్వభావం కాదు. ఖాళీ సమాధి క్రీస్తు అందులో లేని విషయాన్ని చూపిస్తుంది. కాని, ఆయన ఆరోహణం అయినట్లు చూపించలేదు.

మనకి ఒక ఆశ్చర్యకరమైన ప్రత్యామ్నాయం ఎదురు అవుతుంది. 1) శిష్యులు వారిని రక్షించుకోటానికి వారి పరువు పోకుండా ఈ కథను కల్పించారు. ఇదంతా అబద్ధం అని. 2) వారు నిజాయితీ గల వ్యక్తులుగా వారు చూసి. అనుభవించిన విషయాల గురించి చెప్పేరు. శిష్యులు నిజమే చెప్పేరు అనటానికి నాలుగు థియరీలు వున్నవి.

1) పేతురు దుడుకువాడు, క్రీస్తునెరుగనని అబద్ధం చెప్పిన వ్యక్తి భయంతో పారిపోయిన వాడని మనందరికీ తెలుసు. తన ప్రవర్తన వలన ఎన్నో సమస్యలలో పడేవాడు. అటువంటి బలహీన వ్యక్తిత్వం గల వ్యక్తి పునరుద్ధానము తర్వాత హేళన చేయుచున్న గుంపుకి ప్రభువు గురించి బోధించాడు. ఒక రాయి లాగ ప్రభువు కోసం నిలబడ్డాడు. తను ప్రభువు లాగ సిలువ వేయబడటానికి కూడ అర్హుడను కానని తనను తలక్రిందులుగా సిలువ వేయ'మని అడిగినటువంటి వ్యక్తిగా మారేడు. గొప్ప జలప్రళయం లాంటి మార్పు, పాతవి గతించి, నూతన ఆరంభం జరిగింది. యోహాను ఎంతో స్వార్థపరుడు, తనకు వ్యతిరేకులుగా వున్న వారి పై ఆకాశం నుండి అగ్నిని కురిపించాలని అనుకొన్నాడు. యోహాను, ఆయన సహోదరు పరలోక రాజ్యంలో వారికి మంచిస్థానం దొరకాలని తల్లి ద్వారా ప్రయత్నించారు. పునరుద్ధానం

గురించి చెప్పటం మొదలు పెట్టిన తర్వాత యోహాను పూర్తిగా మారిన మనిషని బైబిల్ పండితులు చెబుతున్నారు. ఎంతో ప్రేమించే వ్యక్తిగా మారిపోయాడు. ఇంత గొప్ప మార్పు, జలప్రళయం లాంటి మార్పు వచ్చింది. తోమ – మొదటి నుండి చివర వరకు అనుమానస్తుడు. వాస్తవాన్ని మాత్రం చూస్తాడు. ప్రతిదాన్ని ప్రశ్నిస్తాడు. యేసు ప్రభువు సమరియా ద్వారా వెళ్ళే ముందు, తన శిష్యులతో తన మరణం గురించి చెబుతాడు. అప్పుడు తోమ, మిగతా వారితో మనం కూడ ఆయనతో వెళ్ళి మరణం ఆవుదామని ఎంతో ధైర్యంగా అంటాడు. తోమ ప్రభువు ఒక మానవమాత్రునిలా చనిపోతాడని తలంచాడు. యేసు శిష్యులతో పరలోకంలో గల నివాసాల గురించి చెప్పి 'వాటి దగ్గరకు ఎలా చేరుకోవాలో మీకు తెలుసు' అని చెప్పినప్పుడు, తోమా ఆయన పలికే ప్రతి మాట జాగ్రత్తగా విని, 'నీవు ఎక్కడకు వెళ్తున్నావో మాకు తెలియదు, అక్కడకు వచ్చే మార్గం మాకు ఎలా తెలుస్తుందని" ప్రశ్నించాడు. తోమ వ్యక్తిత్వం అటాంటిది. పునరుద్ధానం నమ్మని వ్యక్తి అతనే. నేను ఆయన గాయాలలో చేతులు పెట్టి చూస్తే గాని నమ్మలేనని అన్నాడు. చూసి నమ్మిన వారి కన్న చూడక విశ్వశించిన వారు ధన్యులని ప్రభువు చెప్పేడు. ప్రభువు తోమాతో నా చేతులలో గాయాలు, నా ప్రక్కలో గాయం చూడమన్నాడు. ఆయన, తోమా మీద కోప పడలేదు. తనను పరీక్షించుకోమని చెప్పేడు. మనం కూడా తోమా వలె దేవుని పరీక్షిస్తున్నాము. తోమా ప్రభువుని చూసి "నా దేవా, నా ప్రభువా" అని ఏడ్చాడు. అటువంటి తోమ, భారతదేశంలోని మద్రాసు నగరంలో హతసాక్షిగా చనిపోయాడు. గొప్ప వేదాంత తత్త్వవేత్తలున్న భారతదేశంలోనికి, బుద్ధునికి, ఇతర మతాలకు జన్మనిచ్చిన భారతదేశము లోనికి హిమాలయాలు దాటి వచ్చి తాను నమ్మిన విశ్వాసాన్ని ప్రచురపరచాడు. తన విశ్వాసం ఎప్పుడు తొణకలేదు. ప్రతి దానిని అనుమానించే వాని నుండి తాను నమ్మిన దానిని పూర్తిగా విశ్వసించే వానిగా మార్పు చెందాడు. క్లిష్ట పరిస్థితులలో మనుష్యులు మారతారని మీరు అనుకోవచ్చు. అబద్ధం మనుష్యులను మంచి వారిగా మార్చలేదు. వీరు పూర్తిగా మారిన వారు. అబద్ధం వారిలో అంత మార్పు తేలేదు.

**2వ కారణం :** పరోక్షపు సాక్ష్యాధారాలు. మార్కు సువార్తలో మార్కు యేసు ప్రభువు తనను "మనుష్య కుమారుడని" పిలుచుకొన్నట్లు ఎక్కువసార్లు వ్రాశాడు. మీరు లెక్కించవచ్చు. మార్కు యేసుని దేవుని కుమారునిగా నిరూపించాలని అనుకొంటే; ఆయన మనుష్య కుమారుడనని చెప్పుకొన్నట్లు అన్నిసార్లు వ్రాసేవాడు కాదు. మనం గమనించినట్లయితే యేసు ప్రభువు తనకు తాను 'మనుష్య కుమారుడ'నని తన ప్రసంగం వినుచున్న హెబ్రీయులకు చెప్పేడు. దానియేలు గ్రంథంలో, హనోకు గ్రంథంలో "మనుష్య కుమారుడు మహిమ మేఘాలలో తన రాజ్య స్థాపనకు అభిషిక్తునిగా వస్తాడని" వ్రాయబడి వున్నది. ఈ విధంగా చూస్తే ప్రభువు తనను తాను మనుష్య కుమారుడనని పిలుచుకోవటం తగినట్లున్నది. కాని అన్యులకు పాతనిబంధన గురించిన జ్ఞానం లేని వారికి, వ్రాసేటప్పుడు కూడ, యేసు తనను తాను 'మనుష్య కుమారుడ"నని పిలుచుకొన్నట్లు మార్కు వ్రాశాడు. అది శిష్యుల రచనలలో, మాటలలో వున్న నిజాయితీకి గుర్తు. అటువంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నవి. ఇటువంటి వాటినే పరోక్షంగా లభించే సాక్ష్యాధారాలని చరిత్రకారులు చెబుతారు.

**ఇంకొక ఉదాహరణ :** క్రొత్త నిబంధన రోజులలో స్త్రీ సాక్ష్యం నమ్మే వారు కాదు. శిష్యులకు ఆ విషయం తెలుసు. అయినా కూడ స్త్రీలు మొదటిగా పునరుద్ధానుడైన క్రీస్తుని చూశారని ఎందుకు చెబుతారు? వారు నిజం చెబుతున్నారు కనుక ప్రపంచ స్త్రీల సాక్ష్యం గురించి నమ్మదని తెలిసినా వారు తమకు తెలిసిన నిజాన్ని చెప్పేరు.

**3వ కారణం :** మూల్యం చెల్లించబడినది. అబద్ధం చెప్పటానికి వారు ఇంత మూల్యం చెల్లింపరు. యోహాను తప్ప మిగతా వారు హతసాక్షులుగా చనిపోయారు. భర్త లోమియ ఆర్మీనియాలో కొరడాలతో కొట్టబడి చనిపోయాడు. తోమ ఒక బ్రాహ్మణుడి కత్తివాత మూలముగ చనిపోయాడు. పేతురు తలక్రిందులుగా సిలువ వేయబడ్డాడు. అంద్రేయ సిలువ వేయబడ్డాడు. లూకా విగ్రహారాధకులైన మతగురువులచే వురి వేయబడ్డాడు. అలెగ్జాంద్రియా పట్టణంలో చనిపోయే వరకు యీడ్చబడ్డాడు. వీరంతా మానవులకు నమ్మశక్యం కానంత మూల్యాన్ని చెల్లించారు.

**4వ కారణం :** వారు ఒంటరిగా చనిపోయారు. శిష్యులు చెప్పే విషయాలలో సత్యం వున్నదని వారు ఒంటరిగా చనిపోవటంలోనే మనకి అర్థం అవుతుంది. ఆ రోజుల్లో ఫోన్లు, శాటిలైట్లు, ఫ్యాక్స్‌లు లేవు. ఆర్మేనియాలో ఉన్నా బర్తలోమియ, ఇండియాలో వున్న తోమ ఒకరితో ఒకరు మాట్లాడుకొనే అవకాశం లేదు. ఒకరినొకరు కలుసుకోలేదు. బర్తలోమియాను కొరడాలతో చర్మం వూడివచ్చి చనిపోయే వరకు కొట్టేరు. 'నేను నిజం చెప్పటం లేదు, నన్ను క్షమించండి, నేను వెళ్ళిపోతాను" అని ఒక్కమాట చెబితే సరిపోతుంది. అదే విధంగా తోమ, నేను అబద్ధం చెబుతున్నానని చెబితే, కత్తితో మరణించి వుండే వాడు కాదు. వీరు ఒకరి నుండి ఒకరు విడిపోయి, వారు చెప్పే సత్యానికి అధిక మూల్యం చెల్లిస్తూ ఒంటరిగా హతసాక్ష్యులు అయ్యారు. వారు మరణాన్ని ఎదుర్కొంటున్నప్పుడు కూడా వారు చెప్పే కథను ఏ మాత్రం మార్చలేదు. దీనిని బట్టి వారు చెప్పేది సత్యం అని ఋజువు అవుతుంది.

ఇది నిజం. ఆయన సమాధిలో నుండి బయటకు వచ్చాడు. అది నిజం అయితే మిగతాది అంతా నిజమే. నిత్యుడైన దేవుని నమ్ముటకు నాకు స్టార్టింగ్ పాయింట్ దొరికినది. ఇప్పుడు నాకు క్రైస్తవత్వం అంటే ఏమిటో అర్థం అయింది. నేను యేసు సమాధి గుడ్డలలో, మూత వేయబడిన సమాధిలో నుండి, ఎటువంటి హడావుడి లేకుండా నీలాకాశంలోనికి వెళ్ళగలడు, ఆ విధంగా వెళ్ళటం ఆయనకు కష్టతరం కాదు, సమస్తం ఆయనలో వున్నది, సమస్తం ఆయన ఆధీనంలో వున్నదని నమ్ముతున్నాను. కాబట్టి దేవుడు మరియలో వుంచిన ఆ పదార్థం, పరిశుద్ధాత్మ ద్వార నజరేయుడైన యేసుగా వచ్చిందని నమ్మటం కష్టం కాదు. ఆయనను విశ్వసించితే అటువంటి దైవ అంశని మనలో కూడ పెడతానని దేవుడు చెప్పేడు. అదే నిజమైన దేవుని యందు తిరిగి జన్మించే అనుభవం. అది క్రొత్త జీవితం, క్రొత్త సృష్టి. మన 'సెల్' లోనికి చొచ్చుకొని పోయే దేవుని దగ్గర నుండి వచ్చు బహుమానం, అదే క్రైస్తవ్యానికి నాంది. నా జీవిత కాలమంతా ఆయనను గురించి తెలుసుకుంటూ, ఆయన వాక్యం ధ్యానించుకొంటూ గడపగలను. పాత నిబంధనలో గల వాగ్దానాలు నేను నా స్వంతం చేసుకొన్నప్పుడు, నా విశ్వాసం నాకు క్రొత్త శక్తిని ఇస్తుంది. ప్రభువుని మరణం నుండి లేపిన శక్తి గల దేవుడు, అటువంటి శక్తితో నన్ను మార్చుతాడు. రేడియో యాక్టివ్ పదార్థాన్ని మనం పట్టుకొన్నప్పుడు, కళ్ళకి కనిపించక పోయినప్పటికీ, మన 'సెల్' నిర్మాణాన్ని మార్చగలదు. దేవుడు మనలో నూతన జీవం నింపుతాడు. మనకి ఆధ్యాత్మిక శక్తిని సమకూర్చే కొత్త జీవం ఆయన మనలో ఉంచుతాడు. అందుకే ఆత్మ, ఆధ్యాత్మికతను వ్యక్తపరుస్తుంది. అందుకే ధర్మవర్తనము ఆత్మ ఫలమని అంటారు. మనలో పెరిగే ఆ కొత్త జీవం ఆయన వాక్యం మీద గల విశ్వాసం వలన పోషింపబడుతుంది. "ఆయన మరణం జయించి లేచాడు" అని నిరూపించబడిన వాక్యం అనే బండ మీద గట్టిగా పునాది వేయబడి వున్నది. ఈ విషయం ఆయన చేస్తానని చెప్పిన వేరే విషయం కూడా నమ్మేటట్లు చేస్తుంది. "నేను తిరిగి వస్తాను" అని ఆయన చెప్పాడు.

© 2007 Pastor Melissa Scott - All Rights Reserved